ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం

ముగ్గురు ఉపాధ్యాయుల సస్పెన్షన్

బెంగళూరు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల ప్రక్రియ ప్రారంభానికి ముందే ముగ్గురు ఉపాధ్యాయులు విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించారని సస్పెండ్‌కు గురయ్యారు. చిత్రదుర్గ జిల్లా గొల్లరహట్టి ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు కేవీ జయమ్మ, మఠదకురుబరహట్టి ఉపాధ్యాయురాలు గిరిజమ్మ, తోపురమాళిగె ఉపాధ్యాయురాలు రూప సస్పెండ్ అయినవారు. పోలింగ్‌బూత్ అధికారులు (ప్రిసైడింగ్ ఆఫీసర్)గా నియమించారు. వీరు విధులకు వెళ్లకపోవడంతో జిల్లా అధికారి వెంకటేశ్ సస్పెండ్ చేస్తూ శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు.

మంత్రుల వారసులొస్తున్నారు..!

- ఐదుగురికి టిక్కెట్లు
- అదే వరుసలో ఖర్గే అల్లుడు

బెంగళూరు, మార్చి 22(ఆంధ్రజ్యోతి)

వారసత్వ రాజకీయాలపై ముఖ్య పార్టీలు ఎదుటివారిని విమర్శిస్తూనే తాము అదే పంథాలో నడుస్తున్నాయి. రాష్ట్రంలో వారసత్వ రాజకీయాలపై కాంగ్రెస్ పార్టీ కీలక నేతలు ఎన్నో సందర్భాలలో జేడీఎస్ పార్టీకి చెందిన దేవెగౌడ కుటుంబంపై విరుచుకుపడ్డారు. ఎన్నికలు వచ్చేసరికి వారసత్వం అనే పదాన్ని అన్ని పార్టీలు పక్కనపెడుతున్నాయి. రాష్ట్ర కేబినెట్ మంత్రులుగా ఉన్న ఐదుగురు తమ వారసులకు టిక్కెట్లు దక్కించుకున్నారు. గతంలో ఎన్నడూలేని విధంగా కేబినెట్‌కు చెందిన ఐదుగురు మంత్రులు తమ పిల్లలను లోక్‌సభ అభ్యర్థులను చేయడం సర్వత్రా చర్చనీయాంశమవుతోంది.



ప్రియాంక జార్కిహోళి



మృణాల్ హెబ్బాళ్కర్





సాగర్ ఖండ్రె



రాధాకృష్ణ దొడ్డమని



సంయుక్త పాటిల్



డాక్టర్ ప్రభ

చిక్కోడి నుంచి ప్రియాంక జార్కిహోళి

రాష్ట్ర ప్రజాపనుల శాఖ మంత్రి సతీశ్‌జార్కిహోళి కుమార్తె ప్రియాంక జార్కిహోళి చిక్కోడి అభ్యర్థి అయ్యారు. సతీశ్ షుగర్స్, బెళగావి షుగర్స్‌తోపాటు 9 సంస్థల్లో డైరెక్టర్‌గా ఉన్న 27 ఏళ్ల ప్రియాంక జార్కిహోళి తొలిసారి లోక్‌సభ బరిలో దిగుతున్నారు. ఎంబీఏ పూర్తి చేసిన ప్రియాంక ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చే విషయమై గడిచిన శాసనసభ ఎన్నికల్లోనూ ప్రస్తావన వచ్చింది. అయితే సాధ్యం కాలేదు.

బెళగావి నుంచి మృణాల్ హెబ్బాళ్కర్

బెళగావి జిల్లాలో తిరుగులేని నాయకురాలిగా రాణిస్తున్న రాష్ట్ర స్త్రీ శిశుసంక్షేమశాఖ మంత్రి లక్ష్మీహెబ్బాళ్కర్ కుమారుడు 31 ఏళ్ల మృణాల్ బెళగావి అభ్యర్థి అయ్యారు. తొలిసారి ప్రత్యక్ష రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. బీఈ సివిల్ ఇంజనీరింగ్ పూర్తి చేసిన మృణాల్ ప్రస్తుతం మృణాల్ షుగర్స్ మేనేజింగ్ డైరెక్టర్‌గా, హర్ష షుగర్స్ డైరెక్టర్‌గా, లక్ష్మీతాయి కో-ఆపరేటివ్ బ్యాంకు డైరెక్టర్‌గా, హర్ష బిల్డర్స్ అండ్ డెవలపర్స్‌లో భాగస్వామిగానూ ఉన్నారు. 2013 నుంచి పార్టీ కార్యకర్తగా కొనసాగుతున్న మృణాల్ రెండోసారి జిల్లా యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడిగా ఉన్నారు. తల్లి లక్ష్మీహెబ్బాళ్కర్ కేబినెట్‌లో కీలక మంత్రి కాగా మేనమామ చెన్నరాజ్ హట్టిహోళి ఎమ్మెల్సీగా ఉన్నారు.

బాగల్కోటె నుంచి సంయుక్తపాటిల్

రాష్ట్ర చక్కెర శాఖ మంత్రి శివానందపాటిల్ కుమార్తె సంయుక్తపాటిల్ తొలిసారి రాజకీయ ప్రవేశం చేశారు. విజయపుర జిల్లాకు చెందిన సంయుక్త పాటిల్‌కు ప్రస్తుతం 30 ఏళ్లు కాగా హైకోర్టు న్యాయవాదిగా కొనసాగుతున్నారు. విజయపుర డీసీసీ బ్యాంకు డైరెక్టర్‌గా, విజయపుర జిల్లా కోళ్ల పరిశ్రమ కోఆపరేటివ్ మార్కెటింగ్ సంఘం అధ్యక్షురాలుగా, జిల్లా యూత్‌కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగానూ వ్యవహరిస్తున్నారు.

బీదర్ నుంచి సాగర్‌ఖండ్రె

లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి అత్యంత తక్కువ వయసు కల్గిన సాగర్ ఖండ్రె బీదర్ అభ్యర్థి అయ్యారు. రాష్ట్ర అటవీ, పర్యావరణశాఖ మంత్రి ఈశ్వర్‌ఖండ్రె కుమారుడు సాగర్‌ఖండ్రె. తొలిసారి ప్రత్యక్షరాజకీయాల్లోకి అడుగుపెట్టారు. బాల్కిలోని శాంతివర్ధకశిక్షణా సంస్థల కార్యదర్శిగా వ్యవహరిస్తున్నారు. ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్నారు.

ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే అల్లుడు సైతం

ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కుటుంబం నుంచి మరొకరు రాజకీయ ప్రవేశం చేశారు. మల్లికార్జున ఖర్గే అల్లుడు రాధాకృష్ణ దొడ్డమని కలబురగి అభ్యర్థి అయ్యారు. సుదీర్ఘకాలంపాటు ఇదే స్థానం నుంచి మల్లికార్జున ఖర్గే గెలుపొందుతూ వచ్చారు. 2019 ఎన్నికల్లో ఆయన ఓటమి చెందడంతో రాజ్యసభకు ఎంపికయ్యారు. ఖర్గే కుమారుడు ప్రియాంకఖర్గే రాష్ట్ర కేబినెట్‌లో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, ఐటీబీటీశాఖల మంత్రిగా వ్యవహరిస్తున్నారు.

దావణగెరె నుంచి మంత్రి భార్య

రాష్ట్ర కాంగ్రెస్‌లో సీనియర్ నేత శ్యామనూరు శివశంకరప్ప కుటుంబం నుంచి మరొకరు అభ్యర్థి అయ్యారు. రాష్ట్ర ఉద్యానవన శాఖ మంత్రి ఎస్ఎస్ మల్లికార్జున భార్య డాక్టర్ ప్రభ తొలిసారి ప్రత్యక్షరాజకీయాల్లోకి వచ్చారు. దంతవైద్యురాలైన ప్రభ గడిచిన కొన్ని ఎన్నికల్లో మామ శ్యామనూరు శివశంకరప్ప, భర్త ఎస్ఎస్ మల్లికార్జున తరఫున ప్రచారం చేశారు. బాపూజీ విద్యాసంస్థ బోర్డు సభ్యురాలిగా, ఎస్ఎస్ కేర్ ట్రస్ట్ లైఫ్‌ట్రస్టీగాను వ్యవహరిస్తున్నారు.

వారసులను రాజధాని ఆదరించేనా?

బెంగళూరు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజధాని బెంగళూరులోని మొత్తం మూడు నియోజకవర్గాలలోనూ కాంగ్రెస్ తరఫున ఈసారి నేతల వారసులు తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. బెంగళూరు నార్త్ కాంగ్రెస్ అభ్యర్థి ప్రొఫెసర్ ఎంవీ రాజీవ్‌గౌడ ప్రస్తుతం కేబినెట్ హోదా కలిగిన రాష్ట్ర నీతి, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడిగా ఉన్నారు. వీరి తండ్రి ఎంవీ వెంకటప్ప ముళబాగిలు శాసనసభా నియోజకవర్గం నుంచి రెండుసార్లు గెలుపొందారు. రెండుసార్లు విధానపరిషత్‌కు నామినేట్ అయ్యారు. శాసనసభ స్పీకర్‌గానూ, విధానపరిషత్ సభాపతిగానూ ఆయన సేవలందించారు. రాజీవ్‌గౌడ 1984లో బెంగళూరు విశ్వవిద్యాలయంలో బీఏ పట్టా పుచ్చుకున్నారు. అనంతరం విదేశాల్లో ఉన్నత విద్యాభ్యాసం కొనసాగించారు. ఓక్లహోమా విశ్వవిద్యాలయంలో అర్థశాస్త్ర ప్రొఫెసర్‌గా కొంతకాలం పనిచేశారు. 2000లో భారత దేశానికి తిరిగి వచ్చిన ఆయన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌లో ప్రొఫెసర్‌గా చేరారు. 2004లో రాహుల్‌గాంధీ రాజకీయాల్లోకి ప్రవేశించిన సమయంలో ఆయన వెంట ఉన్న 24 మంది ప్రముఖ యువనేతల జట్టులో రాజీవ్‌గౌడ ఒకరు కావడం విశేషం. 2013లో ఆయన ఏఐసీసీ అధికార ప్రతినిధిగా నియమితులయ్యారు. 2014లో రాజ్యసభకు నామినేట్ అయ్యారు. రాష్ట్ర రవాణా, దేవదాయ శాఖల మంత్రి ఆర్. రామలింగారెడ్డి కుమార్తె సౌమ్యారెడ్డి ఇటీవలి శాసనసభ ఎన్నికల్లో జయనగర్ నుంచి పోటీ చేసి అత్యల్ప తేడాతో ఓటమిపాలయ్యారు. బెంగళూరులోని ఆర్వీ ఇంజనీరింగ్ కళాశాలలో కెమికల్ ఇంజనీరింగ్ చేసిన ఆమె న్యూయార్క్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో పర్యావరణ సాంకేతికపై ఎంఎస్ చేశారు. 2014లో రాష్ట్ర ప్రాణి కల్యాణ మండలి సభ్యురాలిగా నియమితులయ్యాక రాజకీయాలపై ఆసక్తిని పెంచుకున్నారు. రాష్ట్ర మహిళా కాంగ్రెస్‌లో కొంతకాలం సేవలందించి 2019లో అఖిల భారత మహిళా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. 2018లో బెంగళూరు జయనగర్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ టిక్కెట్‌పై గెలుపొందారు. 2023 ఎన్నికల్లో కేవలం వందల ఓట్ల తేడాతో ఓటమిపాలయ్యారు. ఐదుసార్లు రాజ్యసభకు ఎన్నికైన, 2012 నుంచి 2014 వరకు రాజ్యసభ ఉపాధ్యక్షుడిగా సేవలందించిన కాంగ్రెస్ సీనియర్ నేత కె.రెహ్మాన్ ఖాన్ కుమారుడైన మన్సూర్ అలీఖాన్ 1996లో బెంగళూరు యూనివర్సిటీ నుంచి బీబీఎం పట్టాపుచ్చుకున్నారు. బెంగళూరులో 2001లో ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌ను ఏర్పాటు చేసి విద్యారంగంలో స్థిరపడ్డారు. తన కేకే ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్టు ద్వారా సేవలందిస్తూనే 2013 నుంచి కాంగ్రెస్‌లో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారు. 2022లో కేపీసీసీ ప్రధానకార్యదర్శిగా పనిచేశారు. ఏఐసీసీ కార్యదర్శి హోదాలో తెలంగాణా శాసనసభ ఎన్నికల బాధ్యుడిగా పనిచేశారు. తెలంగాణ ఎన్నికల్లో కాంగ్రెస్ ఘన విజయం అందుకోవడంతో మన్సూర్ అలీఖాన్‌కు జాతీయస్థాయిలో కాంగ్రెస్ పార్టీలో గుర్తింపు లభించింది. ఈ ముగ్గురు రాజకీయనేతల వారసులు రాజధాని రాజకీయాల్లో ఏమేరకు రాణిస్తారో వేచిచూడాలి.



రాజీవ్‌గౌడ



సౌమ్యారెడ్డి



మన్సూర్ అలీఖాన్

జేడీఎస్ ఎమ్మెల్సీ కాంగ్రెస్‌లో చేరిక

బెంగళూరు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): జేడీఎస్ పార్టీ సీనియర్ నేత, ఎమ్మెల్సీ మరితిబ్బేగౌడ కాంగ్రెస్‌లో చేరారు. శుక్రవారం కేపీసీసీలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ముఖ్యమంత్రి సిద్దరామయ్య, ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ మరితిబ్బేగౌడను సాదరంగా స్వాగతించారు. ఎమ్మెల్సీ పదవికి గురువారం రాజీనామా చేసిన మరితిబ్బేగౌడ కాంగ్రెస్‌లో చేరారు. మాజీ ఎమ్మెల్సీ అప్పాజీగౌడ, జిల్లా పంచాయతీ మాజీ అధ్యక్షుడు వెంకటేశ్‌తోపాటు పలువురు పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మరితిబ్బేగౌడ మాట్లాడుతూ సెక్యులర్ భావాలను వీడి జేడీఎస్ పార్టీ బీజేపీతో జతకట్టిందన్నారు. ఆ పార్టీల మధ్య పొత్తు కుదరడంతో జేడీఎస్‌లో కొనసాగదలచుకోలేదన్నారు. ఇదే విషయమై నియోజకవర్గ ప్రజలు, ఉపాధ్యాయులతో చర్చించాక కాంగ్రెస్‌లో చేరేందుకు నిర్ణయించానన్నారు. ఇప్పటివరకు నాలుగుసార్లు దక్షిణ ఉపాధ్యాయ నియోజకవర్గం నుంచి గెలుపొందానన్నారు. తొలిసారి డీకే శివకుమార్ ఆశీస్సులతో టికెట్ దక్కిందని, రెండోసారి 1985లో సిద్దరామయ్య నేతృత్వంలో జనతాదళ్‌లో చేరానన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్‌లో చేరే విషయమై కొన్ని రోజుల క్రితమే నిర్ణయం తీసుకున్నానన్నారు. మండ్య, మైసూరు ప్రాంతాల్లో కాంగ్రెస్ అభ్యర్థుల విజయానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు.



మరితిబ్బేగౌడను స్వాగతిస్తున్న సీఎం సిద్దరామయ్య, డీసీఎం డీకే శివకుమార్

బీజేపీలో కాంగ్రెస్ సంస్కృతి

యడియూరప్పకు నిబంధనలు వర్తించవా..?

మాజీ మంత్రి ఈశ్వరప్ప మండిపాటు

బెంగళూరు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ సంస్కృతి రాష్ట్రంలో బీజేపీకి వచ్చిందని మాజీ మంత్రి ఈశ్వరప్ప మండిపడ్డారు. శివమొగ్గలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎవరెవరో గుర్తులేనివారు కూడా టికెట్లు తెచ్చుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కుటుంబ రాజకీయాలను దూరం పెట్టారని పేర్కొన్నారు. గత శాసనసభ ఎన్నికల్లో తనతోపాటు జగదీశ్ శెట్టర్‌కు పోటీ చేయొద్దని సూచించిన మేరకు అంగీకరించామన్నారు. యడియూరప్ప కుటుంబంలో ఒక కుమారుడు ఎంపీగా ఉన్నా మరో కుమారుడికి ఎమ్మెల్యే టిక్కెట్ ఇచ్చారని తెలిపారు. ఆ తర్వాత పార్టీ రాష్ట్ర అధ్యక్ష పదవి కూడా ఇచ్చారని వివరించారు. గతంలో పార్టీ ఏ నిర్ణయం తీసుకున్నా కోర్ కమిటీలో చర్చించేవారమన్నారు. రాష్ట్ర కమిటీ తీర్మానాన్ని కేంద్రకమిటీ కూడా అంగీకరించేదన్నారు. యడియూరప్ప విషయంలో ఎందుకు నిబంధనలు మారాయో అర్థం కాలేదన్నారు. లోక్‌సభ టికెట్లు నిర్ణయించే ముందు శోభాకరంద్లాజె మరోసారి చిక్కమగళూరు నుంచి పోటీ చేస్తారని, గెలిపించాలని సూచించారన్నారు. అక్కడ శోభా గోబ్యాక్ అంటూ కార్యకర్తలు నిరసనలకు దిగారన్నారు.

అక్కడ వ్యతిరేకత ఉందని బెంగళూరు ఉత్తరలో టిక్కెట్ ఇప్పించారన్నారు. ఇదే విధానం ప్రకారం ప్రతాప్‌సింహ, సీటీ రవికి కూడా ఇతర నియోజకవర్గాల్లో టిక్కెట్లు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. కోర్ కమిటీలోనే 114 మందిలో 84 మంది ప్రతాప్‌సింహకు టికెట్ ఇవ్వాలని సూచించినా తప్పించారంటూ మండిపడ్డారు. కాగా, యడియూరప్పకు వ్యతిరేకంగా ప్రత్యేకమైన పోస్టర్‌లు వెలువడ్డాయి. దేశంలో మోదీజీ పరివార్, రాష్ట్రంలో కుటుంబందే హల్‌చల్ అంటూ పోస్టర్ వేశారు.



ఈశ్వరప్ప

బోర్డు పరీక్షలకు హైకోర్టు పచ్చజెండా

ఎట్టకేలకు గందరగోళానికి తెర

బెంగళూరు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ సిలబస్ ఆధారంగా ఎయిడెడ్, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో 5, 8, 9, తరగతుల బోర్డు పరీక్షలకు, ప్రథమ పీయూ బోర్డు పరీక్షలకు హైకోర్టు పచ్చజెండా చూపింది. ఈ అంశంపై కొద్దిరోజులుగా కొనసాగుతున్న గందరగోళానికి ఎట్టకేలకు శుక్రవారం తెరపడింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె. రాజేశ్‌రాయ్, జస్టిస్ కె. సోమశేఖర్‌తో కూడిన డివిజనల్ బెంచ్ బోర్డు పరీక్షలకు అనుమతి మంజూరు చేస్తూ సాధ్యమైనంత త్వరగా పరీక్షల ప్రక్రియను పూర్తి చేయాలని విద్యాశాఖను ఆదేశించింది. బోర్డు పరీక్షలను సవాల్ చేస్తూ కర్ణాటక ప్రైవేట్ పాఠశాలల సమాఖ్య (రుప్సా) తొలుత హైకోర్టును, ఆపై సుప్రీంకోర్టు ఆశ్రయించిన సంగతి తెలిసిందే. అనంతరం రాష్ట్ర ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు రావడంతో సోమవారం నుంచి బోర్డు పరీక్షలకు సన్నాహాలు చేస్తున్నట్టు విద్యాశాఖ అధికారులు ప్రకటించారు.



సురపుర ఉప ఎన్నికల్లో

కాంగ్రెస్ అభ్యర్థిగా వేణుగోపాలనాయక్

బెంగళూరు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): సురపుర శాసనసభా నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా రాజా వేణుగోపాల నాయక్ పోటీ చేయనున్నారు. ఈ మేరకు కాంగ్రెస్ అధిష్ఠానం ఆయన పేరును ఖరారు చేసిందని కేపీసీసీ అధ్యక్షుడు, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ నగరంలో శుక్రవారం మీడియాకు చెప్పారు. సురపుర కాంగ్రెస్ సిట్టింగ్ ఎమ్మెల్యే రాజా వెంకటప్ప నాయక్ అకస్మిక మృతి కారణంగా ఈ నియోజకవర్గానికి మే 7న జరగనున్న ఉప ఎన్నికల్లో ఆయన కుమారుడు వేణుగోపాల్‌నాయక్‌కు అవకాశం కల్పించారు. కాగా నైరుతి పట్టభద్రుల నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థిగా ఆయనూరు మంజునాథ్ పేరును ఖరారు చేశారు. జూన్‌లో ఈ నియోజకవర్గానికి ఎన్నిక జరగనున్న సంగతి విదితమే.

రూ. 7.86 కోట్ల మద్యం స్వాధీనం

బెంగళూరు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు గ్రామీణ జిల్లా ఎన్నికల అధికారులు శుక్రవారం భారీ ఎత్తున మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. గ్రామీణ ఎన్నికల అధికారి శివశంకర్ నేతృత్వంలో అబ్కారీ పోలీసుల బృందం నెలమంగలలోని డిస్టిలరీలో రికార్డులు లేకుండా నిల్వ చేసిన మద్యాన్ని గుర్తించారు. 1,48,985 లీటర్ల మద్యాన్ని సీజ్ చేశారు. అబ్కారీశాఖ సెక్షన్‌ల ప్రకారం రికార్డులు లేకుండా మద్యాన్ని నిల్వ ఉంచడం నిషేధంగా ఉంది. లిక్కర్‌తోపాటు రెండు లారీలు, రెండు కార్లు, ఒక జీప్, నాలుగు ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నారు. మద్యం విలువ మార్కెట్‌లో రూ.7.86 కోట్లుగా ఉంటుందని ప్రకటించారు. కాగా బెళగావి ఎయిర్‌పోర్ట్‌లో రికార్డులు లేకుండా ఢిల్లీకి విమానంలో వెళ్లేందుకు ప్రయత్నించిన వ్యక్తి నుంచి 1.5 లక్షల రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నారు. గరిష్ఠంగా రూ.50వేల దాకా నగదు కలిగి ఉండేందుకు అవకాశం ఉంది. రూ.2లక్షలు నగదు ఉన్న మేరకు రూ.1.5 లక్షలు స్వాధీనం చేసుకున్నట్టు ప్రకటించారు.



స్వామి వారిని దర్శించుకుంటున్న భక్తులు


సింహ వాహనంపై నారసింహుడు

శ్రీవారి దర్శనానికి తరలివచ్చిన భక్తులు

కదిరి, మార్చి 22 : శ్రీసత్యసాయి జిల్లా కదిరిలో పక్షం రోజుల పాటు జరిగే ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామివారి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా శుక్రవారం నారసింహుడు సింహవాహనం అధిరోహించి, తిరువీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం యాగశాల నుండి విచ్చేసిన శ్రీవారికి గ్రామోత్సవం నిర్వహించారు. సాయంత్రం శ్రీవారిని సింహవాహనం పై అలంకరించి, ఆలయ ప్రాంగణంలో కొలువుదీర్చారు. కదిరి నుండే కాకుండా వివిధ ప్రాంతాల నుండి విచ్చేసిన భక్తులు శ్రీవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం తిరువీధుల్లో విహరిస్తూ శ్రీవారు భక్తులకు దర్శనమిచ్చారు. సాధారణంగా భక్తులు శ్రీవారిని దర్శించుకోవాలంటే ఆలయానికి వెళ్లాల్సిందే. అయితే వృద్ధులు, దివ్యాంగులాంటి ఆలయానికి రాలేని వారి కోసం శ్రీవారే వారి చెంతకు వెళ్ళి దర్శన ప్రాప్తిని కల్గించడం బ్రహ్మోత్సవాలలో విశేషం. ప్రతి రోజు ఒక వాహనం పై కొలువుతీరి భక్తుల చెంతకు శ్రీవారు వెళ్తారు. ఈవాహనసేవలో ఉభయదారులతో పాటు ఈఓ వి.శ్రీనివాసరెడ్డి, ఆలయ ధర్మకర్తలు పాల్గొన్నారు.

నేడు హనుమంత వాహన సేవ

బ్రహ్మోత్సవాలలో భాగంగా ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి వారు శనివారం హనుమంతవాహనం పై భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఉదయం నిత్యపూజ హోమాల అనంతరం గ్రామోత్సవాన్ని నిర్వహిస్తారు. సంధ్యా సమయంలో హనుమంతవాహనం పై కొలువుతీరి శ్రీవారు తిరువీధుల్లో విహరిస్తారు. శ్రీ మహావిష్ణువు దశావతారాల్లో ఒక్కటి అయిన రాముడిని తన భుజస్కంధాల పై మోసిన హనుమంతుడు మరోసారి తనకు అవకాశం ఇవ్వాలని కోరగా, నృసింహావతారంలో కోరిక నెరవేరుతుందని శ్రీరాముడు వరమిచ్చినట్లు , అందుకే నారసింహుడికి వాహనంగా హనుమంతుడు మారతాడని భక్తుల నమ్మకం.




ఇఫ్తార్	: శనివారం సాయంత్రం	06:32
సెహరి	: ఆదివారం ఉదయం	05:06



సింహవాహనంపై భక్తులకు దర్శనమిస్తున్న నారసింహుడు





తుంగభద్ర నీటి మట్టం :1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1,582.07	1,592.81
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	000	997
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	765	8,645
సామర్థ్యం (టీఎంసీలు)	5.56	13.54

ప్రెషర్ కుక్కర్ల స్వాధీనం



కుక్కర్లను స్వాధీనం చేసుకుంటున్న అధికారులు

బళ్లారి సిటీ, మార్చి 22: నగరంలోని వడ్డరబండ ప్రాంతంలో రూ.5.5 లక్షలు విలువ చేసే కుక్కర్లు, ప్యాన్స్, గ్యాస్‌స్టవ్ తదితర విలువైన గృహోపకరణాలను బ్రూస్‌పేట పోలీసులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన వ్యాపారులు 300కుక్కర్లు, 150గ్యాస్ స్టవ్‌లు, 66సీలింగ్ ప్యాన్‌లను వడ్డర బండే గోదాములో అక్రమంగా నిలువ చేశారు. సిటీ ఎమ్మెల్యే భరత్‌రెడ్డి గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు తన పుట్టినరోజు నేపథ్యంలో నియోజకవర్గంలోని ఓటర్ల కుటుంబాలకు కుక్కర్లు పంపిణీ చేసి పాపులర్ అయ్యారు. మరలా లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఓటర్లకు పంపిణీ కోసమే వీటిని సేకరించి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు.

నారీశక్తి రన్ ఫర్ ఫిట్‌నెస్

బళ్లారి సిటీ, మార్చి 22: విజయనగరం జిల్లా హొస్పేట్‌లో నెహ్రూయువ కేంద్రం సహకారంతో శుక్రవారం ఉదయం మహిళలకు ఫిట్‌నెస్ రన్ జరిగింది. ప్రముఖ వైద్యురాలు సుమంగళమ్మ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. మహిళలకు మానసిక, శారీరక దృఢత్వం అవసరమని, వారు సమతూకంతో పనిచేసేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. జననీ సహకార సంఘం అనంతజోషి, పతంజలి యోగా కమిటీకి చెందిన శ్రీరామ, శైలజ, సుజాత, చంద్రిక అశ్విని సహా 25 మందికి పైగా మహిళలు పాల్గొన్నారు. కార్యక్రమంలో నాగేనళ్ళి శ్రీదేవి, జ్యోతి, వీణలకు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు లభించాయి.

చెక్‌పోస్టుల తనిఖీ



చెక్‌పోస్టులను తనిఖీ చేస్తున్న డీసీ

బళ్లారి సిటీ, మార్చి 22: జిల్లాలో ఎన్నికల అక్రమాల నివారణకు ఏర్పాటు చేసిన 24 చెక్‌పోస్టుల్లో చాలావరకు సక్రమంగా పనిచేయడం లేదన్న ఫిర్యాదులు రావడంతో డీసీ ప్రశాంత్‌కుమార్ మిశ్రా స్వయంగా పలు చెక్‌పోస్ట్‌లను సందర్శించారు. ఆంధ్రప్రదేశ్ సరిహద్దులో ఏర్పాటు చేసిన 13 చెక్‌పోస్ట్‌లను ఆయన స్వయంగా పరిశీలించారు. ఒక్కోచెక్‌పోస్ట్ వద్ద ముగ్గురు ఎస్ఎస్‌టీ అధికారులు, పోలీసు సిబ్బందిని నియమించారు. వీడియో సర్వైలెన్స్ బృందాలను కూడా నియమించారు.

క్షయ పట్ల అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న ప్రభుత్వాస్పత్రి ఆరోగ్య శిక్షణాధికారి

సిరుగుప్ప, మార్చి 22: క్షయ వ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా వుండాలని తాలుకా ప్రభుత్వాస్పత్రి ఆరోగ్య శిక్షణాధికారి మహమ్మద్ ఖాసీమ్ తెలిపారు. సిరుగుప్ప పట్టణంలోని 16వ వార్డులో శుక్రవారం క్షయ నివారణపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ప్రభుత్వాస్పత్రి ఆరోగ్య శిక్షణాధికారి ఖాసిమ్ మాట్లాడుతూ క్షయ ఉందని తెలిస్తే తక్షణమే ఆస్పత్రికి వెళ్లి చికిత్స పొందాలని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

అమ్మా! ఓటు వేయడం మరచిపోవద్దు!

● ఓటింగ్‌పై తల్లిదండ్రులకు విద్యార్థుల లేఖ ● పోలింగ్ శాతం పెంచడానికి జిల్లాలో స్వీప్ కమిటీ కొత్త ప్రయోగం

బళ్లారి సిటీ, మార్చి 22: 'అమ్మా! నా ఆరోగ్యం బాగుంది. పరీక్షల కోసం బాగా చదువుతున్నా. ఈ ఏడాది లోక్‌సభ సార్వత్రిక ఎన్నికల సందర్భంగా డబ్బు, సారా లాంటి ప్రలోభాలకు లోనుకాకుండా ఓటింగ్‌లో పాల్గొనండి. అన్నకు కూడా ఓటు వేయమని చెప్పండి. మర్చిపోవద్దు. ఉంటాను. ..ఇట్లు మీ కుమార్తె.'

ఈ ప్రచారం ఏమిటా అనుకోకండి. హాస్టల్లో ఉన్న విద్యార్థులు ఓటు వేయమని తమ తల్లిదండ్రులకు రాసిన ఓ లేఖ ఇది. లోక్‌సభ సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి జిల్లాలో ఎక్కువ మంది ఓటర్లు ఓటింగ్ ప్రక్రియలో పాల్గొనేలా జిల్లా స్వీప్ కమిటీ పలు ప్రచార కార్యక్రమాలు చేపట్టింది. అందులో భాగంగా ఆ కమిటీ విద్యార్థుల చేత తోబుట్టువులకు తల్లిదండ్రులకు లేఖ అభియాన్ పేరుతో ప్రత్యేక అవగాహన ప్రచారాన్ని చేపట్టింది. జిల్లా, తాలూకా స్థాయిలో 295 ఆవాస పాఠశాలలు ఉన్నాయి. హాస్టళ్లలో ఉన్న 15వేల మందికి పైగా విద్యార్థుల చేత ఓటర్లకు లేఖలు రాయించి స్వీప్ కమిటీ అధికారులు లేఖ అభియాన్ పేరిట ప్రచార కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని వివిధ తాలూకాలలో కూడా తాలూకా స్వీప్ నోడల్ అధికారులు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల సమక్షంలో విద్యార్థుల చేత లేఖలు రాయించి లేఖ అభియాన్‌కు శ్రీకారం చుట్టారు.



తల్లిదండ్రులకు తాము రాసిన లేఖలను చూపుతున్న విద్యార్థులు

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోండి

కంప్లి: రానున్న లోక్‌సభ ఎన్నికల్లో ప్రతి ఒక్కరు ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మిగనూరు ప్రాథమిక పాఠశాల విద్యార్థులు వారి తల్లిదండ్రులకు శుక్రవారం లేఖ రూపంలో తెలియజేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల్లో తల్లిదండ్రులు ఓటు హక్కును వినియోగించుకోవాలని విద్యార్థులు లేఖల రూపంలో తెలియజేశారన్నారు. కార్యక్రమంలో వాణి, కవిత, శృతి, పాండురంగ, శివన్నగౌడ, రామప్ప, మంజునాథ్, దేవరాజు, లలిత, చిట్టి, లావణ్య, మీనాక్షి, రాము, మంజునాథ్, శేకన్న తదితరులు పాల్గొన్నారు.

తల్లీబిడ్డల సంరక్షణకు కృషి

బళ్లారి సిటీ, మార్చి 22: తల్లిబిడ్డల ఆరోగ్య పరీక్షలు సకాలంలో చేయించి, కుటుంబాన్ని కంటికి రెప్పలా కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని కర్ణాటక రాష్ట్రసైన్స్ అండ్ టెక్నాలజీ కౌన్సిల్ ఎగ్జిక్యూటివ్ సెక్రటరీ డా.యు.టి. విజయ్ అన్నారు. జిల్లాపాలనాధికారి, జిల్లావైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా ఆసుపత్రిలోని డీఎన్‌బీ హాల్లో మహిళలు, పిల్లలకు ఆరోగ్యం, పరిశుభ్రత, పౌష్టికాహారం ప్రాముఖ్యతపై ఆశా వర్కర్లకు నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం నాణ్యమైన వైద్యసేవలు అందిస్తున్నారని, దీంతో పాటు గర్భిణులు, నవజాత శిశువులకు ఏ సమస్య వచ్చినా కుటుంబ సభ్యులు తమ బాధ్యతను నిర్వర్తించేందుకు ముందుకు రావాలని సూచించారు. ఈ సందర్భంగా కుటుంబ సంక్షేమాధికారి రమేశ్‌బాబు మాట్లాడుతూ తల్లిగర్భిణి అని తెలిసిన రోజు నుంచి సకాలంలో తల్లికార్డు పొందాలన్నారు. టీటీ ఇంజక్షన్, కనీసం 180 ఐరన్ మాత్రలు తీసుకోవడం, స్కానింగ్ చేయడం, ప్రభుత్వఆసుపత్రిలో ప్రసవం చేయడానికి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. వైద్యుల సలహాలు తప్పకుండా పాటించేందుకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. జిల్లాసర్జన్ బసారెడ్డి మాట్లాడుతూ జిల్లా దవాఖానలో నాణ్యమైన సేవలు అందిస్తున్నామని తెలిపారు. ఈసందర్భంగా జిల్లా ఆర్‌సీహెచ్ అధికారి హనుమంతప్ప, సయ్యద్ సమీర్, రామచంద్రరెడ్డి, వెంకటేశ్, సురేఖ, విశాలాక్షి, జిల్లా ఆరోగ్య విద్యాధికారి ఈశ్వర్ దాసప్పనవర్, తదితరులు పాల్గొన్నారు.

సిద్దాపురం చెక్‌పోస్టులో రూ.20 లక్షల నగదు స్వాధీనం

కంప్లి, మార్చి 22: లోక్‌సభ ఎన్నికల సందర్భంగా జిల్లాలో పలుచోట్ల తనిఖీలలో అధికారులు నగదు, మద్యం స్వాధీనం చేసుకున్నారు. విజయనగర జిల్లాలోని కూడ్లిగి తాలుకా సిద్దాపురం సరిహద్దు వద్ద గూడ్స్ వాహనంలో తరలిస్తున్న ఎలాంటి ఆధారాలు లేని రూ.20 లక్షల నగదు ఎన్నికల అధికారులు స్వాధీన పరచుకున్నారు. శుక్రవారం మధ్యాహ్న సమయంలో కూడ్లిగి వైపు వెళుతున్న గూడ్స్ వాహనాన్ని అనుమానంతో తనిఖీచేయగా, ఆ వాహనంలో రూ.20 లక్షలు పట్టుబడింది. ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో కేసునమోదు చేసి నగదును స్వాధీనపరచుకున్నట్లు పోలీసుశాఖ, ఎన్నికల అధికారులు తెలిపారు.

మద్యం బాటిళ్ల స్వాధీనం

జిల్లాలోని పలుచోట్ల ఎక్సైజ్ అధికారులు శుక్రవారం దాడులు నిర్వహించారు. కంప్లి పట్టణంలోని బళ్లారి రోడ్డులో ఓ ఎక్స్‌ఎల్ వాహనంలో 17.280



సోమసముద్రం వద్ద అధికారులు స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లు



అధికారులు స్వాధీనం చేసుకున్న నగదు

లీటర్ల రూ. 27700లు విలువ చేసే మద్యాన్ని కంప్లి ఎక్సైజ్ అధికారులు స్వాధీనపరచుకున్నారు. అలాగే కురుగోడు పరిధిలోని బళ్లారి సిరుగుప్ప రోడ్డులో సోమసముద్రం క్రాస్ వద్ద ఎక్స్‌ఎల్ వాహనంలో 38.60 లీటర్ల బీరు, మద్యం బాటిళ్లను స్వాధీన పరచుకున్నట్లు అధికారులు తెలిపారు. ఎన్నికల సమయంలో మద్యం తరలిస్తే చర్యలు తప్పవని అధికారులు తెలిపారు.

మోకా వద్ద 26 కిలోల వెండి, రూ.3.50 లక్షల నగదు స్వాధీనం

బళ్లారిరూరల్: తాలుకాలోని మోకా గ్రామ సమీపంలో మారెమ్మ దేవస్థానం వద్ద శుక్రవారం పీడీ హళ్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రుద్రప్ప వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా పెద్దఎత్తున వెండి, నగదు పట్టుబడ్డాయి. బళ్లారి నుంచి ఆదోని వైపు వెళుతున్న వాహనంలో ఆదోనికి చెందిన విజయ్ కుమార్ పాటిల్, మహమ్మద్ అబ్బాస్‌లను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 26 కిలోల వెండి, రూ.3.50 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రాయచూరులో రూ.4లక్షలు పట్టివేత

రాయచూరు, మార్చి 22 : లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో సరిహద్దు చెక్‌పోస్ట్‌ల వద్ద నిఘా పెంచిన అధికారులు శుక్రవారం ఆధారాలు లేకుండా రవాణా చేస్తున్న రూ.4లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. తెలంగాణ వైపునుంచి జిల్లాలోకి ప్రవేశిస్తున్న టీఎస్ 23 ఈఎస్ 7361 వాహనాన్ని అనుమానంతో ఆపిన అధికారులు చెక్‌పోస్ట్ వద్ద తనిఖీ చేస్తున్న సమయంలో వాహనంలో రూ.4లక్షలు ఉన్నట్టు గుర్తించారు. నగదును వెంటనే ఎన్నికల అధికారులకు అందజేశారు. నగదును నిబంధనల మేరకు స్వాధీనం చేసుకున్నట్లు జడ్పీ సీఈఓ తుకారాం పాండ్వే ఒక ప్రకటనలో వివరించారు.



తనిఖీలో పట్టుబడిన రూ.4లక్షల నగదు

నగర స్వచ్ఛతకు కొత్త ప్రయోగం



స్పెషల్ డ్రైవ్‌ను ప్రారంభిస్తున్న కమిషనర్ చలపతి

రాయచూరు, మార్చి 22: నగర పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించిన నూతన కమిషనర్ చలపతి సరికొత్త ప్రయోగానికి తెర తీశారు. వ్యాపార సముదాయాలు ఎక్కువగా ఉండే ప్రధాన రోడ్లలో పెద్ద ఎత్తున ఘనవ్యర్థాలు పేరుకుపోతుండడాన్ని గమనించిన కొత్త కమిషనర్ వాటి తొలగింపునకు ప్రత్యేక కార్యచరణ సిద్ధం చేశారు. రాత్రి వేళ మూడు గంటల పాటు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ఘన వ్యర్థాలు తొలగించే పనిని గురువారం రాత్రి నుంచి ప్రారంభించారు. దీంతో ప్రధాన వ్యాపార కేంద్రాలుగా ఉండే రహదారుల వెంట ఒక్కసారిగా కొత్త మార్పు కనిపించిందంటూ పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

జల సంరక్షణ అందరి కర్తవ్యం

● ప్రపంచ జలదినోత్సవంలో ఈఈ శివశంకర్

బళ్లారి సిటీ, మార్చి 22: ప్రతి జీవికి నీరు అత్యంత అవసరమని, ఆ నీటిని సంరక్షించుకోవడం మన కర్తవ్యమని కర్ణాటక నీటిపారుదల నిగమ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కేబీహెచ్ శివశంకర్ అన్నారు. విజయనగరం జిల్లా హొసపేటలోని మునిరాబాద్ ఇనిస్టిట్యూషన్ ఆఫ్ ఇంజినీర్స్, హొసపేటలోని ఎస్ఎస్‌బీఎన్ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ సహకారంతో శుక్రవారం నిర్వహించిన ప్రపంచ జల దినోత్సవ వేడుకలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. స్వచ్ఛమైన తాగునీటికి పెరుగుతున్న డిమాండ్‌ను హైలైట్ చేశారు. ఈ నేపథ్యంలో నీటి సంరక్షణపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరాన్ని, ప్రపంచ నీటి దినోత్సవ ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు. బెంగళూరుకు చెందిన ప్రముఖ సామాజిక కార్యకర్త సదానంద మాట్లాడుతూ రాష్ట్రాల మధ్య నీటి వనరుల సమాన పంపిణీ ప్రాముఖ్యత గురించి తెలిపారు. రైతులు ఎదుర్కొంటున్న సవాళ్లను పరిష్కరించడానికి సాంకేతిక సహాయం తీసుకోవాలని ప్రభుత్వాలను కోరారు. ఇంజినీర్ల సంస్థ చైర్మన్ డా. శశిధర్ మాట్లాడుతూ 2030 నాటికి ప్రపంచ వ్యాప్తంగా ప్రతి ఒక్కరికి స్వచ్ఛమైన తాగునీరు అందించడమే వాటర్ డే ముఖ్య లక్ష్యమన్నారు. ఎస్ఎస్‌బీఎన్ కాలేజ్ ప్రిన్సిపాల్ విశ్వనాథ్‌గౌడ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మితంగా నీటిని వాడాలన్నారు. నీటి సంరక్షణ, న్యాయబద్ధమైన వినియోగంపై ప్రతిజ్ఞ చేయించారు. భవిష్యత్తు తరాల కోసం ఈ అమూల్యమైన వనరును కాపాడాలని పిలుపునిచ్చారు. ఈసందర్భంగా ప్రొఫెసర్ జగదీశ్‌హిరేమఠ్, సతీశ్ సూరిమఠ్, శోభా పాటిల్, సత్తార్, మల్లికార్జున ఇటగి తదితరులు పాల్గొన్నారు.



నీటి సంరక్షణ, వినియోగంపై పతిజ్ఞ చేస్తున్న ప్రొఫెసర్లు

నీటిని వృథా చేయరాదు

సిరుగుప్ప, మార్చి 22 : నీటిని వృథా చేయరాదని తాలుకా పంచాయతీ ఈవో పవన్ కుమార్ దండప్ప తెలిపారు. సిరుగుప్ప పట్టణం తాలుకా పంచాయతీ భవనంలో శుక్రవారం ప్రపంచ జల దినోత్సవ కార్యక్రమం జరిగింది. తాలుకా పంచాయతీ ఈవో మొక్కలకు నీరు పోయడం ద్వారా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ యేడాది వర్షాభావం వల్ల తాగునీటి సమస్య రోజురోజుకు ఎక్కువవుతున్నట్లు తెలిపారు. కావున తాగునీటిని వృథా చేయరాదని, ప్రస్తుతం 700 అడుగులలోతు తవ్వినా నీరు పడటం లేదని తెలిపారు. ఈ సందర్భంగా న్యాయవాదులు మల్లిగౌడ, రూపేష్ నాయక్, సమాజ సేవకులు అబ్దుల్ నబీ, తాలుకా పంచాయతీ మేనేజర్ సుజాత పాల్గొన్నారు.



మొక్కకు నీరుపోసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఈవో పవన్

ఎవరికీ ఇబ్బందులు లేకుండా ఎన్నికల నిర్వహణ



సమావేశంలో మాట్లాడుతున్న సహాయ ఎన్నికల అధికారి సతీష్

తోరణగల్లు, మార్చి 22: ఎవరికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఎన్నికలు జరగాలని సహాయ ఎన్నికల అధికారి సతీష్ పేర్కొన్నారు. శ్రీ శివానంద భారతిస్వామి మఠం ఆవరణలో తాలుకా అధికారులు, పోలీసు అధికారుల ఆధ్వర్యంలో లోక్‌సభ ఎన్నికల సందర్భంగా సర్వజన సంపర్క సభ నిర్వహించారు. ఈ సమావేశానికి తహసీల్దార్ అనిల్ కుమార్, ఇతర పోలీసు అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సహాయ ఎన్నికల అధికారి సతీష్ మాట్లాడుతూ నిర్భయంగా ఎవరికీ భయపడకుండా ఓటును సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం పోలీసు అధికారులు రైల్వే స్టేషన్ రోడ్డు నుంచి శ్రీ శివానంద భారతి మఠం వరకు పథసంచలనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవో షడక్షరయ్య, డీవైఎస్‌పీ ప్రసాద్ గోకుల్, సీపీఐ మహేష్‌గౌడ్, పీఎస్‌ఐ సన్న వీరేష్, పురసభ సభ్యులు సోమప్ప, రామకృష్ణ, వెంకటేష్, బసన్నగౌడ్, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

హోసూరు జోన్

కృష్ణగిరి బరిలో ముగ్గురు ప్రముఖులు



అన్నాడీఎంకే అభ్యర్థి జయప్రకాశ్, కాంగ్రెస్ అభ్యర్థి సెల్లకుమార్, బీజేపీ అభ్యర్థి నరసింహన్

హోసూరు మార్చి 22: కృష్ణరి లోక్‌సభ ఎన్నికల బరిలో మూడు ప్రముఖ పార్టీల నాయకులు తలపడుతున్నారు. ఎన్డీయే కూటమి నుంచి బీజేపీ అభ్యర్థిగా నరసింహన్, ఇండియా కూటమిలో కాంగ్రెస్ అభ్యర్థిగా సెల్లకుమార్, అన్నాడీఎంకే అభ్యర్థిగా జయప్రకాశ్‌లు పోటీ పడుతున్నారు. వీరిలో సెల్లకుమార్ రెండుసార్లు పోటీ పడి ఒకసారి గెలుపొందగా, మరొకసారి ఓడిపోయారు. ప్రస్తుతం మూడోసారి పోటీ పడుతున్నారు. గతంలో కాంగ్రెస్ పార్టీ నుంచి నరసింహన్ ఎంపీగా ప్రాతినిథ్యం వహించారు. కొంతకాలానికి ఆయన బీజేపీలో చేరి పార్టీ అభివృద్ధికోసం కృషిచేశారు. అన్నాడీఎంకే అభ్యర్థిగా తొలిసారి జయప్రకాశ్ పోటీ చేస్తున్నారు. ఆయనకు సామాజికవర్గం అండగా నిలుస్తుందన్న ఆశాభావంతో ఉన్నారు. తెలుగు, కన్నడ ఓటర్లు కూడా తనవైపు మొగ్గు చూపుతారని దీమా వ్యక్తం చేస్తున్నారు.

మళ్లీ తెరపైకి హోసూరు-కృష్ణగిరి రైలు మార్గం

హోసూరు మార్చి 22: కృష్ణగిరి లోకసభ ఎన్నికల నాటికి హోసూరు-కృష్ణగిరి వైపు రైలు మార్గం ఏర్పడుతుందని గత దశాబ్దాలుగా పోటీచేసే ప్రతి అభ్యర్థి ప్రకటిస్తున్నారు. అంగ్లేయుల పాలన నుంచి హోసూరు మార్గంలో సేలం వైపుగా రైళ్లు నడుస్తున్నాయి. స్వాతంత్రం వచ్చిన తర్వాత హోసూరు నుంచి కృష్ణగిరి మార్గంలో చెన్నైకు రైలు నడపాలని అందరు నాయకులు ప్రతిపాదిస్తూనే ఉన్నారు. కానీ ఇంతవరకు ఆ పని జరగలేదు. ఎన్నికల వేళ మాత్రం ప్రతి పార్టీ అభ్యర్థి హోసూరు నుంచి చెన్నైకు రైలు ఏర్పాటు చేస్తామని హామీ ఇస్తున్నారు. తాజాగా లోక్‌సభ ఎన్నికల ప్రక్రియ కావడంతో మళ్లీ రైలు మార్గం అంశం తెరపైకి వచ్చింది. ఈ హామీ ఎప్పుడు అమలులోకి వస్తుందో వేచి చూడాల్సిందే.

ఈవీఎంలను పరిశీలించిన కలెక్టర్

హోసూరు మార్చి 22: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో జిల్లా ఎన్నికల అధికారిగా ఉన్న కలెక్టర్ సరయు శుక్రవారం ఈవీఎంలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల సంఘం తొలి షెడ్యూల్‌కు అనుగుణంగా 6 శాసనసభ నియోజకవర్గాలకు సంబంధించి అన్ని రాజకీయ పార్టీ ప్రతినిధుల సమక్షంలో ఈవీఎంల్లో గుర్తుల కేటాయింపు కంప్యూటర్ ద్వారా చేపట్టామన్నారు. ఉత్తంగరై, కృష్ణగిరి, వేపనహళ్ళి, హోసూరు, తళి, బర్గూరు శాసనసభ నియోజకవర్గాలకు ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల నుంచి 2267 ఈవీఎంలు, 2455 వీవీప్యాట్‌లను కేటాయింపుల ప్రకారం సాయుధగార్డుల నేతృత్వంలో పంపిణీ చేశామన్నారు. ఈ సందర్భంగా జిల్లా పోలీసు ఉన్నతాధికారులు తంగదురై, సాదనైకురళ్, సెల్వి, ప్రియంక, బాబు, గీతా, రాణి, పన్నీర్ సెల్వం, కుమరన్, రమేశ్‌కుమార్ తదితరులు అధికారులు పాల్గొన్నారు.

బేడరపల్లి ప్రభుత్వ పాఠశాలలో అడ్మిషన్ల కోసం ర్యాలీ

హోసూరు (మత్తిగిరి) మార్చి 22: హోసూరు యూనియన్ మున్సిపల్ కార్పొరేషన్ మిడిల్ స్కూల్‌లో ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఒకటో తరగతికి 100మందిని, రెండో తరగతి నుంచి ఎనిమిదో తరగతి వరకు 150 మందిని చేర్చుకోవాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో పాఠశాలలో అడ్మిషన్లకోసం శుక్రవారం ప్రత్యేక జాగృతి నిర్వహించారు. బేడరపల్లిలో డప్పు, వాయిదాలతో విద్యార్థులు స్వయంగా బ్యానర్లతో పురవీధులలో ర్యాలీగా సాగారు. అన్నానగర్, భారతీయర్ నగర్, రాజాజీనగర్, ఇందిరానగర్, బాలాజీ నగర్, కామరాజ్ నగర్‌లో ఊరేగింపుగా వెళ్లి తల్లిదండ్రులకు కరపత్రాలను అందచేశారు. ఈ సందర్భంగా 11 మంది పిల్లలను ఒకటో తరగతిలో చేర్పించారు. బేడరపల్లి ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరుతూ కామరాజ్ నగర్‌లో మానవహారంగా ఈ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో ప్రధానోపాధ్యాయుడు పొనాగేశ్, స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ చైర్‌పర్సన్ మంజుల విద్యానేత గోమతి, గ్రాడ్యుయేట్ టీచర్ పెరియస్వామి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



జాగృతి ర్యాలీలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

రాయచూరు కాంగ్రెస్ అభ్యర్థిగా కుమార్ నాయక్

● రిటైర్డ్ ఐఏఎస్‌కు దక్కిన అవకాశం

రాయచూరు, మార్చి 22 : కాంగ్రెస్ పార్టీ రాయచూరు నుంచి రిటైర్డ్ ఐఏఎస్ అధికారి కుమార్ నాయక్‌కు అవకాశం కల్పించింది. ఇక్కడ నుంచి ఇప్పటికి 11 సార్లు విజయం సాధించిన కాంగ్రెస్ పార్టీ ఈ స్థానాన్ని కంచుకోటగా భావిస్తోంది. గతంలో రాయచూరు నుంచి వెంకటేశ్ నాయక్ ఆరు సార్లు ఎంపీగా గెలుపొందగా మరో సారి ఆయన కుమారుడు బీవీ నాయక్ ఎంపీగా గెలుపొందారు. గత శాసనసభ ఎన్నికల సందర్భంగా బీవీ నాయక్ కాంగ్రెస్‌ను వీడి బీజేపీలోకి చేరడంతో ఆ కుటుంబానికి కాంగ్రెస్‌లో అవకాశం లేకుండా పోయింది. కాగా జీ కుమార్ నాయక్ గతంలో రాయచూరు జిల్లాధికారిగా పని చేయడంతో పాటు వివిధ ప్రభుత్వ శాఖల్లో కీలకంగా పని చేశారు. కుమార్ నాయక్ దాదాపు రెండేళ్ల పాటు జిల్లాకు ఇన్‌చార్జ్ కార్యదర్శిగా సేవలందించారు. కుమార్ నాయక్ అభ్యర్థిత్వం పట్ల స్థానిక కాంగ్రెస్ నాయకుల నుంచి వ్యతిరేకత లేకపోగా పోటీకి వారెవరూ పెద్దగా ఆసక్తి చూపకపోవడంతో హైకమాండ్ ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది.

1957 నుంచి మొదలుకొని ఇప్పటి వరకు జరిగిన ఎన్నికల్లో 1967లో స్వతంత్ర్య అభ్యర్థి 1996లో జనతాదళ్ (ఎస్) అభ్యర్థి గెలుపొందగా, 2019 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి విజయం సాధించారు. ఈ క్రమంలో అత్యధిక సార్లు విజయాన్ని సాధించి కంచుకోటగా భావిస్తున్న రాయచూరు స్థానాన్ని తిరిగి నిలబెట్టుకునేందుకు కాంగ్రెస్ పార్టీ సిద్ధపడుతోంది.



బీజేపీలో తొలగని ఉత్కంఠ..!



మాజీ ఎంపీ బీవీ నాయక్, సిట్టింగ్ ఎంపీ అమరేశ్వర్ నాయక్

రాయచూరు, మార్చి 22 : లోకసభ ఎన్నికల అభ్యర్థిత్వానికి సంబంధించి భారతీయ జనతా పార్టీలో సందిగ్ధం ఇప్పటికి వీడడం లేదు. ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ తన అభ్యర్థిగా రిటైర్డ్ ఐఏఎస్ అధికారి జీ కుమార్ నాయక్ పేరు ఖరారు చేయగా ఆ పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. అదే సమయంలో అభ్యర్థిత్వం ఖరారు కాకపోవడంతో బీజేపీ శ్రేణుల్లో ఒకింత నిరుత్సాహం చోటు చేసుకుంది. సిట్టింగ్ ఎంపీ రాజా అమరేశ్వర్ నాయక్, మాజీ ఎంపీ బీవీ నాయక్‌ల మధ్య తీవ్ర పోటీ నెలకోవడంతో అభ్యర్థిత్వం ఖరారులో పార్టీ రాష్ట్ర నాయకత్వం కొంత సందిగ్ధంలో ఉన్నట్లు తెలుస్తుంది. ఈ క్రమంలో అధిష్టానం ఎవ్వరికి అవకాశం కల్పిస్తుందన్నదానిపై ఆ పార్టీ వర్గాల్లో తీవ్ర ఉత్కఠ నెలకొంది.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంయ్...

భగత్‌సింగ్ (వర్ధంతి)




'విప్లవం వర్ధిల్లాలి' అనే నినాదంతో స్వాతంత్ర్య సంగ్రామంలో చైతన్యపరిచిన భగత్‌సింగ్ 1907 సెప్టెంబరు 28న పంజాబ్‌లోని బంగా ప్రాంతంలో జన్మించారు. ప్రస్తుతం పాకిస్థాన్‌లో ఉంది. స్వాతంత్ర్య పోరాటంలో ఢిల్లీ వీధులలో ఎర్రకాగితాలు చల్లి ప్రజలను చైతన్యం చేశారు. నవజవాన్ భారతసభ, హిందూస్థాన్ సోషలిస్టు రిపబ్లిక్ అసోసియేషన్ సంస్థల ఏర్పాటులో కీలకంగా వ్యవహరించారు. ఉర్దూ, పంజాబీ పత్రికలకు పలు రచనలు అందించారు. 23వ యేట 1931 మార్చి 23న ఉరి తీయబడ్డారు. 1968లో కేంద్ర ప్రభుత్వం ఆయన జ్ఞాపకార్థం ప్రత్యేక పోస్టల్ స్టాంప్ విడుదల చేసింది.

కిరణ్ మజుందార్ షా (పుట్టినరోజు)



'పద్మభూషణ్' గ్రహీత కిరణ్ మజుందార్ షా 1953 మార్చి 23న పూనెలో జన్మించారు. దేశంలో పేరొందిన బెంగళూరు కేంద్రంగా పనిచేస్తున్న బయోకాన్ సంస్థ ఛైర్‌పర్సన్, మేనేజింగ్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు. ఐఐఎంకు ఛైర్‌పర్సన్‌గా వ్యవహరించారు. ఓత్మెర్ గోల్డ్‌మెడల్ ఇతర పురస్కారాలు పొందారు. యునైటెడ్ స్టేట్స్ నేషనల్ అకాడమీ ఆఫ్ ఇంజనీరింగ్‌లో 2019లో సభ్యురాలిగా పొందిన తొలి భారతీయ మహిళ. సంస్థ సామాజికసేవలో భాగంగా ఆరోగ్య, విద్య, మౌలిక సదుపాయాలు కల్పిస్తూ ప్రత్యేకత చాటుకున్నారు. 2019లో ఫోర్బ్స్ జాబితాలో ప్రపంచంలో శక్తివంతమైన మహిళల్లో 68వ స్థానంలో నిలిచారు. సైన్స్ అండ్ టెక్నాలజీలో సేవలకు 2022లో హెచ్‌కే ఫిరోదా జీవిత సాఫల్య పురస్కారం, పలు జాతీయ, అంతర్జాతీయ గౌరవాలు అందుకున్నారు.

శ్రీకాంత్ (పుట్టినరోజు)



టాలీవుడ్‌లో పేరొందిన నటుడు శ్రీకాంత్ 1968 మార్చి 23న కర్ణాటక రాష్ట్రం కొప్పళ్ జిల్లా గంగావతిలో జన్మించారు. తెలుగు సినిమా నటుడు. 120కు పైగా సినిమాలలో నటించారు. 'మహాత్మా'కు నంది స్పెషల్ జ్యూరీ అవార్డు, 'శంకర్‌దాదా ఎంబీబీఎస్'కు ఫిల్మ్‌ఫేర్ బెస్ట్ సపోర్టింగ్ యాక్టర్ అవార్డు, 'సరైనోడు'కు సైమా అవార్డ్ ఫర్ బెస్ట్ సపోర్టింగ్ యాక్టర్ తదితర పురస్కారాలు అందుకున్నారు. సినీ నటి ఊహను వివాహం చేసుకున్నారు. మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్‌లోనూ క్రియాశీలకంగా వ్యవహరించారు.

స్మృతి ఇరానీ (పుట్టినరోజు)



స్మృతి జుబిన్ ఇరానీ 1976 మార్చి 23న న్యూ ఢిల్లీలో జన్మించారు. బీజేపీలో క్రియాశీలకంగా ఉన్నారు. అమేథి నుంచి లోక్‌సభ సభ్యురాలిగా కొనసాగుతున్నారు. ప్రస్తుతం కేంద్ర స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రిగాను, మైనారిటీ వ్యవహారాలశాఖ మంత్రిగాను వ్యవహరిస్తున్నారు. కేంద్రమంత్రిగా వివిధ శాఖల్లో పని చేశారు. రాజకీయాల్లోకి రాకముందు ఆమె తొలుత మోడల్, బుల్లితెర నటి, నిర్మాతగా రాణించారు. ఉత్తమ నటిగా ఐదుసార్లు ఇండియన్ టెలివిజన్ అకాడమీ అవార్డు అందుకున్నారు. హిందీ, బెంగాలీ, మరాఠీ, గుజరాతీ, పంజాబీ తదితర భాషలలో మాట్లాడగలరు. ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యుహెచ్‌ఓ)కు గుడ్‌విల్ అంబాసిడర్‌గా ఉన్నారు.

కంగనా రనౌత్ (పుట్టినరోజు)



బాలీవుడ్ నటి, పద్మశ్రీ గ్రహీత కంగనా రనౌత్ 1987 మార్చి 23న హిమాచల్ ప్రదేశ్ లోని భంబ్లా ప్రాంతంలో జన్మించారు. బాలీవుడ్‌లో అత్యధిక పారితోషికం అందుకున్న నటిగా గుర్తింపు పొందారు. మూడు జాతీయ పురస్కారాలు, నాలుగు ఫిలింఫేర్ అవార్డులు అందుకున్నారు. చిన్నతనంలో డాక్టర్ అవ్వాలని భావించారు. అయితే 16ఏళ్లకు తన కెరీర్ తానే రూపొందించుకోవాలని ఢిల్లీ చేరి మోడల్ అయ్యారు. 2006లో 'గ్యాంగ్‌స్టర్' సినిమాతో తెరంగేట్రం చేశారు. ఫోర్బ్స్ ఇండియా సెలెబ్రిటీ 100లో ఒకరిగా ఆరుసార్లు నిలిచారు.

గారపాటికి ఆత్మీయ సన్మానం


సన్మానిస్తున్న మంత్రి శివరాజ్ తంగడగి

బెంగళూరు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సమాజ సేవకుడు, అఖిల కర్ణాటక కమ్మ సంఘం అధ్యక్షుడు డా.గారపాటి రామకృష్ణకు బెంగళూరులో శుక్రవారం ఆత్మీయ సన్మానం జరిగింది. కన్నడ సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి సాంస్కృతిక శాఖా మంత్రి శివరాజ తంగడగి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి తంగడగి ప్రసంగిస్తూ దాదాపు నాలుగు దశాబ్దాలుగా గారపాటి లయన్స్‌క్లబ్‌తో పాటు వివిధ స్వచ్ఛంద సంస్థల ద్వారా గ్రామీణప్రాంతాల్లోని ప్రజల విద్యా, ఆరోగ్య సాంస్కృతిక, ఆధ్యాత్మిక వికాసానికి ఎంతగానో కృషి చేస్తున్నారన్నారు.

విద్యార్థిని ఒకరే... పరీక్షా సిబ్బంది ఆరుగురు

బెంగళూరు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ద్వితీయ పీయుసీ వార్షిక పరీక్షలు గురువారం ప్రశాంతంగా ముగిశాయి. చివరి రోజు తుమకూరు జిల్లా కుణిగల్ పట్టణంలోని మహాత్మాగాంధీ పియు కాలేజీలో ఏర్పాటైన పరీక్షా కేంద్రంలో జరిగిన సంస్కృత పరీక్షకు కేవలం ఒక విద్యార్థిని మాత్రమే హాజరైంది. అయితే విద్యార్థిని ఒకరే అయినా ఇన్విజిలేటర్‌తో సహా ఆరుగురు సిబ్బంది ఈ పరీక్షను పర్యవేక్షించడం విశేషం. ఈ కేంద్రంలో బీజీఎస్ కాలేజీకి చెందిన మానస ప్రథమ భాష సంస్కృతం పరీక్షను రాసింది. ఒక్కతే విద్యార్థిని, ఆరుగురు పరీక్షా సిబ్బంది అంశం స్థానికంగా సోషల్ మీడియాలో శుక్రవారం వైరల్ అయింది.

ఇంకుడుగుంతలపై నిర్లక్ష్యమే కొంప ముంచిందా..?

» రాజధాని జలక్షామంపై నిపుణులు

బెంగళూరు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): బృహత్ బెంగళూరు మహానగర పాలికె పరిధిలో కొత్తగా నిర్మించే ఇళ్లు, అపార్ట్‌మెంట్‌లలో తప్పనిసరిగా ఇంకుడుగుంతలు నిర్మించాలనే నిబంధన పట్టించుకోకపోవడం వల్లే భూగర్భజలాలు అడుగంటా రాజధానికి జలక్షామం ఏర్పడిందని నిపుణులు అంటున్నారు. వరల్డ్ వాటర్‌డే సందర్భంగా నగరంలో శుక్రవారం ఏర్పాటైన ప్రత్యేక సదస్సులో పాల్గొన్న నిపుణులు రాజధాని నీటి సంక్షోభ కారణాలపై సమీక్ష జరిపారు. ఇంకుడు గుంతలు క్రమపద్ధతిలో నిర్మించి ఉంటే సమస్య ఇంత తీవ్రరూపం దాల్చేదికాదనే అభిప్రాయాలు వ్యక్తం అయ్యాయి. బెంగళూరు నగరంలో భూగర్భజలాలు 1200 నుంచి 1400 అడుగుల లోతున ఉన్నాయి. చేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందాన అడ్డగోలుగా బోరుబావులు తవ్వడాన్ని చాలా ఏళ్ళ క్రితం నియంత్రించి ఉండాలన్న అభిప్రాయం కూడా వ్యక్తమైంది. బోరు బావులు ఎండిపోవడానికి, భూగర్భజలాలు తగ్గిపోవడానికి సారూప్యం ఉందన్నారు. సదస్సులో బీబీఎంపీ మాజీ కార్పొరేటర్ ఎన్ఆర్ రమేశ్ ప్రసంగిస్తూ దశాబ్దంకిందటే దూరదృష్టితో యడియూరు వార్డు పరిధిలో 197 రహదారులపై డ్రైనేజీ పైపులతోపాటు కనీసం 400 లీటర్ల సామర్థ్యం కల్గిన వర్షపునీటి సేకరణ గుంతలను ఏర్పాటు చేశామన్నారు. ఈ వార్డులోని 15 ఉద్యానవనాల్లో ప్రతి 50-75 మీటర్లకు ఒకటి చొప్పున 4వేల నుంచి 12 వేల లీటర్ల సామర్థ్యం కల్గిన ఇంకుడు గుంతలను ఏర్పాటు చేశామన్నారు. ఫలితంగా ఒకసారి వర్షం కురిస్తే యడియూరు వార్డు పరిధిలో మొత్తం 2,781 గుంతలతో కలిపి 8.68 లక్షల లీటర్ల నీటిసేకరణ అవుతుందన్నారు. భూగర్భజలాలను పెంచేందుకు ఈ ప్రయోగం బాగా విజయవంతమైందన్నారు. ఫలితంగా ఈ ప్రాంతంలో సగటున 213 అడుగులకే బోర్లులో నీరు లభ్యత ఉందన్నారు. సదస్సులో కన్నడ పోరాటనేత గురుదేవ్ నారాయణకుమార్ ప్రసంగిస్తూ ఇకనైనా అప్రమత్తమై నీటి సంరక్షణ విషయంలో కఠిన నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. నగర వ్యాప్తంగా అన్ని నివాసాలలో, అపార్ట్‌మెంట్‌లలో తప్పనిసరిగా ఇంకుడు గుంతలు ఉండేలా చూడాలన్నారు. ఇందుకు ప్రత్యేక పర్యవేక్షణ అవసరమన్నారు. ఇదే సమయంలోనే ఆయన ట్యాంకర్ల మాఫియాను నియంత్రించే దిశలో ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ఒకింత సంతృప్తికరంగా ఉన్నాయన్నారు. మొత్తానికి సదస్సులో ఇంకుడుగుంతల విషయంలో ఇంతకాలం చేసిన నిర్లక్ష్యమే కొంప ముంచిందన్న అభిప్రాయం వ్యక్తమైంది.

అండర్‌పాస్ నిర్మించాలి

దొడ్డబళ్లాపుర, మార్చి 22: నిత్యం 3వేలకుపైగా ప్రజలు సంచరించే 40 గ్రామాలను అనుసంధానం చేసే జాతీయ రహదారి 248ని ఒక్కసారిగా జాతీయ రహదారి ప్రాధికార మూసివేయడం సమస్యగా మారింది. దీంతో గ్రామస్థులు నిరసన తెలిపారు. డాబస్‌పేట నుంచి హోసూరుకు వెళ్లేందుకు దొడ్డబళ్లాపుర మార్గం కీలకమైనది. ట్రాఫిక్‌ను నియంత్రించడంలో భాగంగా అవుటర్ రింగ్ రోడ్డు చేపట్టారు. ఈ మార్గంలో దొడ్డబళ్లాపుర-హొసరఘట్టకు వీలు కల్పించారు. రింగ్‌రోడ్డు ప్లాన్ చేపట్టినవేళ వివేకానందనగర్ వద్ద అండర్‌పాస్ నిర్మించాలని భావించారు. అయితే ఇక్కడ కొంతమంది ప్రభుత్వభూమిని కబ్జా చేయడమే కాక అండర్‌పాస్ నిర్మాణం వద్దంటూ స్టే తెచ్చారు. దీంతో అండర్‌పాస్ నిర్మించకనే రహదారి అందుబాటులో వచ్చినా పలు కారణాలతో ఈ మార్గంలో సంచారానికి జాతీయ రహదారి ప్రాధికార అనుమతించలేదు. దీంతో గ్రామస్థులు సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఈ సందర్భంగా గ్రామస్థులు ఆదిత్య, నాగేశ్ మాట్లాడుతూ చిక్కతుమకూరు గ్రామం ఉన్నప్పటి నుంచి ఈ మార్గంలోనే రాకపోకలు సాగిస్తున్నారన్నారు. మాజీ ఎమ్మెల్యే వెంకటరమణయ్య చొరవతో ఇక్కడ అండర్‌పాస్ నిర్మాణానికి రహదారి ప్రాధికార అంగీకరించిందన్నారు. అయితే ఇక్కడ గోమాళ స్థలాన్ని కొంతమంది ఆక్రమించి అండర్‌పాస్ నిర్మాణం కాకుండా అడ్డుకున్నారని ఆక్రోశం వ్యక్తం చేశారు. రాకపోకలకోసం అండర్‌పాస్ నిర్మించాలని లేనిపక్షంలో ఎన్నికల బహిష్కరణకు తాము వెనుకాడేది లేదని స్పష్టం చేశారు. స్థానిక ప్రముఖుడు రంగరాజు మాట్లాడుతూ ఈ మార్గంలో రైతులు తాము పండించిన కూరగాయలు రవాణా చేస్తారని, పాఠశాల కళాశాల విద్యార్థులకు ఈ మార్గమే కీలకమన్నారు. పట్టణం నుంచి స్మశానానికి వెళ్లేందుకు కూడా ఇదే మార్గమన్నారు. బమూల్ డైరెక్టర్ బీసీ ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ కొంతమంది ఉద్దేశ్యపూర్వకంగానే అధికారులను దారితప్పించి అండర్‌పాస్ నిర్మాణం చేపట్టకుండా అడ్డుకోవడంతో ప్రజలంతా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. నిరసనలో రైతు ప్రముఖులు వసంతకుమార్, సతీశ్ కెంపణ్ణ, సందేశ్ తదితరులు పాల్గొన్నారు.

అందరికీ అందని గ్యారెంటీలు

» హామీల అమలులో విఫలమైన కాంగ్రెస్


మీడియాతో ఎమ్మెల్సీ భారతి శెట్టి

బెంగళూరు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం గొప్పగా చెప్పుకునే గ్యారెంటీ పథకాలు అందరికీ అందడంలేదని ఈ విషయంలో ప్రజలకు ఇచ్చిన మాటను ఆ పార్టీ నిలబెట్టుకోలేకపోయిందని బీజేపీ విరుచుకుపడింది. బెంగళూరు మల్లేశ్వరంలోని బీజేపీ ప్రధాన కార్యాలయంలో పార్టీ ఎమ్మెల్సీ భారతి శెట్టి శుక్రవారం మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో లక్షలాది మంది అర్హులకు గ్యారెంటీ పథకాలు అందడం లేదన్నారు. గ్యారెంటీలకే నిధులన్నింటినీ మళ్లిస్తున్నందున అభివృద్ధి కార్యక్రమాలు పూర్తిగా కుంటుపడ్డాయని రాష్ట్రం ఆర్థికంగా దివాళా తీసిందని ఆమె ఆరోపించారు. రాష్ట్రంలో కరువు పరిస్థితిని నిభాయించే విషయంలో రాజధాని బెంగళూరు నగరంలో తాగునీటి హాహాకారాలను నివారించే విషయంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. నగరంలో ట్యాంకర్ల మాఫియా ఆగడాలు పెరిగిపోయాయని వీటిని ప్రభుత్వానికి ఏమాత్రం నియంత్రణ లేదని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలపై తమ పార్టీ కార్యకర్తలు ప్రజాక్షేత్రంలోకి వెళ్ళి ప్రచారం చేస్తారని ఆమె ప్రకటించారు. రాష్ట్రంలో బీజేపీ-జేడీఎస్ మిత్రకూటమి గతంతో పోల్చితే అత్యధిక స్థానాలను కైవసం చేసుకోవడం ఖాయమని ఆమె ధీమా వ్యక్తం చేశారు.

శివమొగ్గ కాంగ్రెస్ అభ్యర్థిపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు


ఫిర్యాదు చేస్తున్న బీజేపీ నేతలు

బెంగళూరు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): శివమొగ్గ లోక్‌సభ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి గీతా శివరాజ్‌కుమార్‌పై బీజేపీ శుక్రవారం రాష్ట్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసింది. ప్రముఖ సినీ నటుడైన శివరాజ్‌కుమార్ ఫోటోలతో కూడిన ఫ్లెక్సీలు, సినిమా పోస్టర్లను ఆమె ప్రచార సమయంలో వినియోగిస్తున్నారని తద్వారా ఓటర్లను ప్రలోభ పరుస్తున్నారని బీజేపీ తన ఫిర్యాదులో పేర్కొంది. వీటిని వినియోగించకుండా నిషేధించాలని ఎన్నికల సంఘాన్ని కోరింది. విధానపరిషత్ సభ్యుడు చలవాది నారాయణస్వామి, రాష్ట్ర అధికార ప్రతినిధి హెచ్ వెంకటేశ బద్దేరి, పార్టీ న్యాయవిభాగం కన్వీనర్ వసంతకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సైన్స్ ఎగ్జిబిషన్


ప్రదర్శనను వీక్షిస్తున్న ఇస్రో మాజీ ఛైర్మన్ కిరణ్‌కుమార్

దొమ్మసంద్ర, మార్చి 22: సమర్థనం దివ్యాంగుల సంస్థ ఆధ్వర్యంలో స్థానిక హెచ్ఎస్ఆర్ లే అవుట్‌లో పాఠశాల ఆవరణలో సైన్స్ ఎగ్జిబిషన్‌ను శుక్రవారం నిర్వహించారు. ఎగ్జిబిషన్‌ను ఇస్రో సంస్థ మాజీ ఛైర్మన్ కిరణ్‌కుమార్ లాంఛనంగా ప్రారంభించి మాట్లాడుతూ చిన్నారులకోసం సైన్స్ మేళాను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. వారు మరింత జ్ఞానార్జన చేసి గొప్ప సాధకులు కావాలని ఆకాంక్షించారు. 500కుపైగా విద్యార్థులు పాల్గొని తాము సిద్ధం చేసిన వస్తువులను ప్రదర్శించారు. కార్యక్రమంలో ఏరోనాటికల్ సొసైటీ ఆఫ్ ఇండియా అధ్యక్షులు డాక్టర్ జీ సతీశ్‌రెడ్డి, కర్ణాటక సైన్స్ అండ్ టెక్నాలజీ సీఈఓ డాక్టర్ ఏఎం రమేశ్, సమర్థనం దివ్యాంగుల సంస్థ సంస్థాపకులు డాక్టర్ జీకే మహంతేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత విద్య పెంపుతోనే మహిళా చైతన్యం సాధ్యం

» మాజీ చీఫ్ సెక్రటరీ రత్నప్రభ



మహిళా దినోత్సవంలో పాల్గొన్న మహిళా సాధకులు

బెంగళూరు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్యాశాతం మహిళలో పెరిగితేనే చైతన్యం సాధ్యమని రాష్ట్ర ప్రభుత్వ మాజీ చీఫ్ సెక్రటరీ రత్నప్రభ అభిప్రాయపడ్డారు. సౌందర్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ సైన్స్ కళాశాలలో మహిళా దినోత్సవాన్ని గురువారం జరిపారు. ఈసందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి రత్నప్రభ మాట్లాడుతూ నారీ శక్తి భారత్‌లో యుగాల కాలం నుంచి వస్తోందన్నారు. అందుకు ఎంతోమంది రాణించిన చరిత్ర ఉందన్నారు. ప్రముఖ నటి ప్రియాంక ఉపేంద్ర,, సిస్కో సంస్థ రిక్రూట్‌మెంట్ ముఖ్యులు స్వప్నాజాదవ్‌తో పాటు పలువురు వక్తలు భాగస్వామ్యులయ్యారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ ప్రతీక్షా కీర్తన్ కుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ బీఏ వాసు, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ తాలూకా పదాధికారుల ఎంపిక


సమావేశంలో మాజీ ఎమ్మెల్యే రాజణ్ణ తదితరులు

శిడ్లఘట్ట, మార్చి 22: అధిష్ఠానం ఆదేశాల మేరకు తాలూకా, బీజేపీ హోబళి స్థాయి పదాధికారులను నియమించినట్టు మాజీ ఎమ్మెల్యే ఎం రాజణ్ణ తెలిపారు. పట్టణంలో శుక్రవారం బీజేపీ సేవాసౌధలో ఏర్పాటైన పదాధికారుల నియామక సమావేశంలో ఆయన మాట్లాడుతూ అందరూ చేరి లోక్‌సభ ఎన్నికల్లో నరేంద్రమోదీని మళ్లీ ప్రధానిగా చేసేందుకు కృషి చేయాలని పదాధికారులకు సూచించారు. చిన్నపాటి సమస్యలు ఉన్నా పరిష్కరించుకుని ముందుకు సాగాలన్నారు. గ్రామీణ హోబళి బీజేపీ అధ్యక్షుడు సీకల్ ఆనందేగౌడ నూతన పదాధికారులను ప్రకటించారు. గ్రామీణ యువమోర్చా అధ్యక్షుడిగా జైసింహ, ప్రధాన కార్యదర్శిగా పృథ్విరాజ్, రెండో ప్రధాన కార్యదర్శిగా బచ్చేగౌడ, మహిళా మోర్చా అధ్యక్షురాలిగా సేతురియ, ప్రధాన కార్యదర్శిగా మహాలక్ష్మి, రెండో ప్రధాన కార్యదర్శిగా సులోచనా, రైతు మోర్చా అధ్యక్షులుగా వెంకటేశ్, ప్రధాన కార్యదర్శిగా జయచంద్ర, రెండో ప్రధాన కార్యదర్శిగా నరసింహారెడ్డి, ఓబీసీ మోర్చా అధ్యక్షులుగా లక్ష్మీనారాయణ ఇలా పలువురిని నియమించారు. అభ్యర్థులు ఎవరైనా పార్టీ విజయానికి కృషి చేయాలన్నారు.

కోలాహలంగా ఐపీఎల్ ప్రారంభం

» అబ్బురపరచిన లేజర్ షో - ఆకట్టుకున్న రెహ్మాన్ సంగీత విభావరి

» ఉర్రూతలూగించిన అక్షయ్‌కుమార్ నృత్యం


జాతీయ పతాకంతో బైక్‌పై బాలీవుడ్ నటులు అక్షయ్‌కుమార్, టైగర్ ష్రాఫ్

పెరంబూర్, మార్చి 22: ప్రపంచవ్యాప్తంగా క్రికెట్ అభిమానులు ఎంతగానో ఎదురుచూస్తున్న ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)17వ సీజన్ టీ20 పోటీలు శుక్రవారం కోలాహలంగా ప్రారంభమయ్యాయి. స్థానిక చేపాక్కంలోని ఎంఏ చిదంబరం స్టేడియంలో సాయంత్రం 6.30 గంటలకు పోటీల ప్రారంభం సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆద్యంతం ఆకట్టుకున్నాయి. అభిమానుల కేకలు, ఈలలతో చేపాక్కం మైదానం మార్మోగింది.

తరలివచ్చిన అభిమానులు...

ఐపీఎల్ పోటీల్లో భాగంగా తొలి మ్యాచ్ చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్కే), రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) మధ్య రాత్రి 8 గంటలకు ప్రారంభమైంది. ఈ పోటీలకు సంబంధించిన ఆన్‌లైన్ టిక్కెట్ల విక్రయాలు హాట్‌కేకుల్లా 10 నిమిషాల్లోనే విక్రయమయ్యాయి. టిక్కెట్లు పొందిన అభిమానులు, స్పాన్సర్ సంస్థలు అందజేసిన టిక్కెట్లతో అభిమానులు మధ్యాహ్నం 3 గంటల నుంచే స్టేడియానికి చేరుకున్నారు. తమ జట్ల పేర్లను చెంపలపై ముద్రించుకొనేందుకు అభిమానులు పోటీపడ్డారు. ఇక, పొరుగు రాష్ట్రాలకు చెందిన అభిమానులు గురువారం రాత్రే చెన్నైకి చేరుకున్నారు. ఈ పోటీలు వీక్షించేందుకు వచ్చిన విదేశీ అభిమానులు స్థానిక మెరీనా తీరంలోని దివంగత మాజీ ముఖ్యమంత్రులు ఎంజీఆర్, జయలలిత, కరుణానిధి స్మారక మందిరాలను సందర్శించారు. ఆ ప్రాంతాలలో సెల్ఫీలు తీసుకుంటూ ఆనందంగా గడిపారు.

బాలీవుడ్ నటుడు అక్షయ్‌కుమార్...

ఐపీఎల్ మ్యాచ్ ప్రారంభోత్సవం సందర్భంగా బాలీవుడ్ నటులు అక్షయ్‌కుమార్, టైగర్ ష్రాఫ్ నృత్యాలతో అభిమానులు ఊగిపోయారు. తొలుత అక్షయ్‌కుమార్ జాతీయ పతాకం చేతబట్టి తాళ్ల సాయంతో పై నుంచి వేదిక పైకి చేరుకున్నారు. అనంతరం పలు హిందీ, తమిళం సినిమా పాటలకు డాన్సర్స్‌తో కలసి వారు చేసిన నృత్యాలకు అభిమానులు కేరింతలు కొట్టారు. మధ్యలో అక్షయ్‌కుమార్ బైకు నడుపుతుండగా టైగర్ ష్రాఫ్ జాతీయ పతాకం చేతబూని బైక్‌పై స్టేడియం చుట్టూ తిరుగుతూ అభిమానులను ఆనందపరిచారు. సాంస్కృతిక ప్రదర్శనలో భాగంగా ప్రముఖ సినీ సంగీత దర్శకులు ఏఆర్ రెహ్మాన్ సంగీత విభావరి అభిమానులను అలరించింది. ప్రముఖ నేపథ్యగాయనీ, గాయకులతో కలసి రెహ్మాన్ 'వందే మాతరం....', 'జయహో...' అనే ఆల్బమ్‌లోని పాటలు సహా తమిళం, హిందీ సినీ గీతాలు ఆలపించారు. ఈ పాటలకు డాన్సర్స్ వేసిన స్టెప్పులకు అనుగుణంగా రెహ్మాన్, నేపథ్యగాయకులు కూడా డాన్స్ చేశారు.


భారీ సైజు ఐపీఎల్ ట్రోఫీ వద్ద నృత్య ప్రదర్శన

కేంద్రమంత్రి శోభాకరంద్లాజెపై కేసుకు హైకోర్టు బ్రేక్

బెంగళూరు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): తమిళులపట్ల అవహేళనగా వ్యాఖ్యానించిన కేంద్రమంత్రి శోభాకరంద్లాజెపై బెంగళూరు నగరత్‌పేట పోలీస్‌స్టేషన్‌లో దాఖలైన ఎఫ్ఐఆర్, తదుపరి విచారణకు హైకోర్టు బ్రేక్ పెట్టింది. మంత్రి శోభాకరంద్లాజెపై దాఖలైన కేసును రద్దు చేయాలని ఆమె తరపు న్యాయవాది హైకోర్టులో పిటీషన్ దాఖలు చేశారు. శుక్రవారం విచారణ జరిపిన న్యాయమూర్తి కృష్ణ ఎస్ దీక్షిత్ ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది. దీంతో కేంద్రమంత్రి శోభా కరంద్లాజెకు ఊరట లభించినట్టయ్యింది. విచారణ వేళ ధర్మాసనం తీవ్రమైన వ్యాఖ్యలు చేసింది. మాటలు ఎప్పుడూ ముత్యాల్లా ఉండాలని సూచించింది. మీ కక్షిదారులకు ఎలా మాట్లాడాలో అవగాహన కల్పించాలంటూ ధర్మాసనం మౌఖికంగా సూచించింది. ఇటీవల నగరత్‌పేటలో మొబైల్ దుకాణంలో హనుమాన్‌చాలీసా పాటలు పెట్టడాన్ని స్థానిక ముస్లిం యువకులు కొందరు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇదే సందర్భంలో మొబైల్ దుకాణం నిర్వాహకుడు ముఖేశ్‌పై దాడి చేశారు. ముఖేశ్‌కు మద్దతుగా కేంద్రమంత్రి శోభాకరంద్లాజె, ఎంపీ తేజస్వి సూర్యల ఆధ్వర్యంలో నగరత్‌పేటలో భారీ ర్యాలీ జరిగింది. ఇదే సందర్భంలో కేంద్రమంత్రి మాట్లాడుతూ రామేశ్వరం కెఫె హోటల్‌లో బాంబుపేలుళ్ల అంశంపై చేసిన వ్యాఖ్యలు దుమారమయ్యాయి. తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఆమె వ్యాఖ్యలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈమేరకు నగరత్‌పేట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది.

బుల్లితెర నటి సోనుగౌడ అరెస్టు

» దత్తత స్వీకరణలో నిబంధనలు ఉల్లంఘన

బెంగళూరు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): దత్తత స్వీకరణలో నిబంధనలు ఉల్లంఘించిన మేరకు బుల్లితెర, రీల్‌స్టార్ నటి సోను శ్రీనివాసగౌడను శుక్రవారం అరెస్టు చేశారు. బెంగళూరు పశ్చిమ విభాగం డీసీపీ గిరీశ్ శుక్రవారం మీడియాకు తెలిపారు. రాయచూరుకు చెందిన దంపతుల ఆడశిశువును దత్తత తీసుకున్నానని సోషల్‌మీడియాలో ప్రచారం చేశారు. దత్తత స్వీకరణకు సంబంధించి ప్రభుత్వ నిబంధనలు పాటించకపోవడంతో స్త్రీశిశుసంక్షేమశాఖ అధికారులు ఫిర్యాదు చేశారు. ఈమేరకు జువైనెల్ జస్టిస్ చట్టం ప్రకారం అరెస్టు చేశామన్నారు. బిగ్‌బాస్, ఓటీటీ వేదికగా కన్నడ సీజన్ రియాలిటీ షోలో సోనుగౌడ పాల్గొన్నారు. పోలీసుల అరెస్టుపై ఆమె మాట్లాడుతూ పాజిటివ్ లేదా నెగటివ్ ఏదైనా న్యూస్‌లో ఉన్నానన్నారు. రాయచూరు దంపతులకు నలుగురు పిల్లలు కాగా తొలి సంతానం మగశిశువు, మిగిలిన ముగ్గురు ఆడశిశువులు. వీరిలో రెండో శిశువును సోనుగౌడ దత్తత తీసుకున్నారు. సోనుగౌడ ఇంటి సమీపంలో కూలి పనులకోసం రాయచూరు దంపతులు వచ్చారు. చిన్నారి రోజూ తిండికోసం సోనును అడిగేవారు. ఇలా పరిచయమైన చిన్నారికి కొంతకాలంపాటు ఆహారం అందించి దత్తత తీసుకున్నానంటూ సోషల్‌మీడియాలో పోస్టు చేశారు. ఏడేళ్ల చిన్నారితో కలసి షాపింగ్, రీల్స్‌కు సంబంధించి పోస్టు చేశారు. సోనుగౌడను అరెస్టు చేసిన పోలీసులు సీజేఎం కోర్టు ముందు హాజరుపరిచి నాలుగురోజుల పోలీసు కస్టడీకు తీసుకున్నారు. చిన్నారితో పాటు తల్లిదండ్రులనున రాయచూరుకు తీసుకెళ్ళి వివరాలు తీసుకోవాల్సి ఉందని కోర్టుకు వివరించిన మేరకు కస్టడీకు అనుమతిచ్చారు. దీంతో డైరీ సర్కిల్‌లోని మహిళా సాంత్వన కేంద్రానికి సోనుగౌడను తరలించారు.

శుద్ధనీటిని పరిశీలించుకోవాలి

బెంగళూరు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): దేశమంతటా వేసవి కాలం వచ్చిందంటే నీటి సమస్య తీవ్రమవుతుంది. అందుకు సాధారణ వర్షాకాలంలో మాదిరిగా నీరు లభించదు. బోరుబావులలో భూగర్భజలం తగ్గిపోతుండటంతో సమస్య నెలకొంటుందని అయితే ఉపయోగించే నీరు శుద్ధతను పరిశీలించుకోవాల్సి ఉందని డ్రింక్‌ప్రైమ్ సంస్థ సీఈఓ విజయేందరరెడ్డి అభిప్రాయపడ్డారు. బెంగళూరులోని వివిధ ప్రాంతాలలో తాగునీటి సమస్య నెలరోజులుగా జటిలమవుతోంది. ప్రత్యామ్నాయంగా నీటిని సమకూర్చుకుంటున్నారు. కానీ వాటి నాణ్యత ముఖ్యమంటున్నారు. శుక్రవారం నగరంలోని మహావీర్ రాంచెస్ అపార్ట్‌మెంట్‌లో నివసించే వారి ఇళ్ళలో వాడే నీటిని పరిశీలించారు. ఇదే సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రింక్ ప్రైమ్ మొబైల్ వాటర్ క్వాలిటీ టెస్టింగ్ ల్యాబొరేటరీ ద్వారా వాటి ఫలితాలు తెల్పుతామన్నారు. డ్రింక్ ప్రైమ్ కో ఫౌండర్ సీఓఓ మనస్ రంజన్ మాట్లాడుతూ బెంగళూరు నివాసితులు నీటి నాణ్యతను పరీక్షించుకునే విషయమై అవగాహన కల్పించాలనే ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నామన్నారు. నీరు అనేది రోజంతా ప్రజలు ఎక్కువగా వినియోగిస్తారన్నారు. ఆహార నాణ్యతకు ఇచ్చే ప్రాధాన్యత నీటికి ఇవ్వరన్నారు. నీరులో మార్పుల వస్తే పలు సమస్యలు తలెత్తుతాయన్నారు. హెచ్ఎస్ఆర్ లేఅవుట్ సహా పలు చోట్ల పరిశీలనలు జరిపామన్నారు.

ఆదిచుంచనగిరి మఠాధిపతిని కలిసిన రాజీవ్ గౌడ


మఠాధిపతి ఆశీర్వాదం అందుకుంటూ

బెంగళూరు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు నార్త్ కాంగ్రెస్ అభ్యర్థి రాజీవ్‌గౌడ నగరంలోని ఆదిచుంచ నగిరి మఠాన్ని శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా మఠాధిపతి డా.నిర్మలా నందనాథ స్వామిజీ ఆశీస్సులను పొందారు. మఠం ప్రాంగణంలోని కాలభైరవేశ్వర స్వామి ఆలయాన్ని సందర్శించి పూజలు జరిపారు. ఈ సందర్భంగా ఆయన కొద్దిసేపు మీడియాతో మాట్లాడారు. పార్టీ తనపై అచంచల విశ్వాసం ఉంచి బెంగళూరు ఉత్తర స్థానం టికెట్ ఇవ్వడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ప్రజలకుపూర్తిగా అందుబాటులో ఉంటూ లోక్‌సభలో వారి బాణిగా ఉంటానని ఆయన ప్రకటించారు. రాజధాని బెంగళూరు పేరు ప్రతిష్ఠలు అంతర్జాతీయ స్థాయిలో ఇనుమడింప చేసేందుకు తన వంతు కృషిని చిత్తశుద్ధితో చేస్తానన్నారు.

ఢిల్లీలో పేరొందిన రుచులతో రెస్టారెంట్

బెంగళూరు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): దేశరాజధాని ఢిల్లీలో పేరొందిన కరిమ్స్ నగరంలోని హెచ్ఆర్‌బీఆర్ లేఅవుట్‌లో శాఖను ఆరంభించింది. దేశీయ రుచులతో రెండున్నర దశాబ్దాల అనుభవం కలిగిన రెస్టారెంట్ నగరంలో ఏర్పాటు ద్వారా అన్నివర్గాల ప్రజలను ఆకర్షించనుందని పహత్స్ కంపెనీల ఎండీ డాక్టర్ అజీజ్ అహ్మద్ అభిప్రాయపడ్డారు. దేశంలోని అన్ని రాష్ట్రాల ప్రజలు ఢిల్లీలో వివిధ పనులు, పర్యాటకం కోసం వచ్చేవారని వారు కోరుకునేలాంటి రుచులు అందించేందుకు రెస్టారెంట్ తెరిచామన్నారు. ప్రస్తుతం బెంగళూరు దేశంలోనే అన్ని రంగాలలోను అభివృద్ధి చెందుతోందన్నారు. ఏడంతస్తుల భవనంలో రెస్టారెంట్ తెరిచామన్నారు. బ్యాంక్వెట్‌హాల్‌తో పాటు ఆకర్షణీయమైన డైనింగ్ మా ప్రత్యేకత అన్నారు.

25న నృసింహుడి బ్రహ్మరథోత్సవం

చేళూరు, మార్చి 22: తాలూకాలోని బురదగుంట గ్రామపంచాయతీ పరిధిలోని గడిగవారిపల్లిలో కొలువైన తిరుమలపుర లక్ష్మీనరసింహస్వామి ఆలయ ఉత్సవాలు ఈనెల 23నుంచి 27వరకు జరుగనున్నాయి. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనాథ్, ఆలయ ధర్మకర్త లక్ష్మణరెడ్డి శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ ఫాల్గుణమాస శుద్ధ త్రయోదశి నుంచి బహుళ ద్వితీయ వరకు ఉత్సవాలు ఉంటాయన్నారు. 23న అంకురార్పణ, 24న స్వామివారి కల్యాణోత్సవం, 25న బ్రహ్మరథోత్సవం, 26న పార్వేట ఉత్సవం, 27న శయనోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయన్నారు.